ఓంశ్రీసాయిరాం

## వ్యాసభగవానుడు

శైశవప్రాయం నుంచీ వ్యాసుడు గాఢమైన అధ్యయనమూ, సాధనా కొనసాగించాడు. పుట్టుకతోనే ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలనేతపన ఆయనలో వున్నది. దివ్యమైన జ్ఞానమును, వైభవమును సాధించినందువల్ల ఆయనను వ్యాసనారాయణుడు అంటున్నారు. వ్యాసుడు లోకగురువు. వేదమంత్రాలు విభాగాల క్రింద క్రమబద్ధం చేశాడు. మహావేదాంత గ్రంథం బ్రహ్మసూత్ర రచన చేశాడు. సామాన్య ప్రజల పట్ల ప్రేమతో వారికి వేద వేదాంత విషయాలు సులభంగా అందించటానికి మహాభారత, శ్రీమద్భాగవత పురాణాల రూపంలో వ్యాఖ్యానాలు రచించాడు. అనంతంగా, అగాధంగా వుండిన వేదాలను అవగాహన చేసుకొనే మార్గం ఏర్పరచి విద్యార్థులకు చాలా ఉపకారం చేసినందువల్ల ఆయనను వేదవ్యాసుడన్నారు. భగవంతుని బహువిధ నామరూపాలను ఆధారంచేసుకొని అష్టాదశ పురాణాలు రచించాడు. నైతిక నియమావళిని, చారిత్రిక సన్నివేశములనూ, తాత్విక సిద్ధాంతములనూ, సాంఘిక ఆదర్శములనూ సోదాహరణపూర్వకంగా బోధించే గ్రంథాలు పురాణాలు. ఈ పురాణల ద్వారా అహంకారమూ, స్వార్థమూ జయించాలని వ్యాసుడు ఉపదేశించినట్లు ఒక శ్లోకం తెలుపుచున్నది.

అష్టాదశ పురాణేషు వ్యాసాయ వచనద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.

పరోపకారం కంటె పుణ్యమూ, పరపీడనం కంటె పాపమూ లేదని వ్యాసుని అభిప్రాయం. ఇతరులకు ఉపకారం చేయటమనేది మందు. ఇతరులకు అపకారం చేయకుండా వుండటం అనేది పథ్యం. వైద్యానికి యివి రెండూ అవసరం. సుఖదుఃఖములు, గౌరవఅగౌరవములు, వైభవవినాశములు అనే ద్వంద్వములు మానవుని పట్టి పీడిస్తూ మానవునికి చిత్తశాంతి. స్థైర్యము లేకుండా చేస్తున్నవి. వీటివల్ల కలిగే బాధను నివారించటానికి ఇదే తగిన వైద్యం.

వ్యాసుడు గొప్పమహర్షి. అతను నారాయణ స్వరూపుడని ఒక ప్రఖ్యాతి. ఇతను అరుంధతియొక్క మునిమనుమడు. ఆషాఢపూర్ణిమ పుట్టిన దినము. కనుకనే, వ్యాసపూర్ణిమ అనటానికి యిదే మూలకారణము. నారాయణ తత్త్వమును నరులకు బోధించినవాడు వ్యాసుడు. 'వ్యాసోనారాయణో హరిః' అని ఆ కార్యము కొరకు ఆగమించిన నారాయణుడే ఆయన. భగవంతుని అవతారతత్త్వమునూ, లీలావిషేషములనూ లోకానికి అందించే దీక్షను వ్యాసుడు వహించినాడు. ఇతిహాస పురాణాదులలో, శ్రీమద్భాగవతములో, బ్రహ్మసూత్ర గ్రంథములో ఆ కైంకర్యమును చక్కగా నిర్వహించి కృతార్థుడైనాడు. ఆకాశమంతా సంచరించి నిండియున్న సంగీత, సంభాషణలను రేడియో రిసీవర్లు స్పష్టముగా పట్టి మన శ్రవణేంద్రియములకు అందించుచున్న రీతిగా, విశ్వవ్యాప్తమై, అగమ్యగోచరమైయున్న పరమాత్మ తత్త్వమును వ్యాసులు తమ గ్రంథరత్నముల మూలకముగా మానవులకనుగ్రహించెను. వ్యాసుడు వేదములయొక్క పవిత్రమైన అంతరార్థములను వ్యాప్తి గావించినాడు. భగవంతుని నిర్గుణత్వమునే ఆయన వ్యాప్తి గావించినాడు. భగవంతుని సర్వవ్యాపకత్వమునే ప్రబోధించినాడు. ఆదర్శవంతమైన కథలుగా రచించి, విష్ణుత్వమునే ప్రచారము చేశాడు. ఈ సేవను పురస్కరించుకొని, వ్యాసభగవానుని ఆదిగురువనియు, లోకగురువనియు వ్యాసపూర్ణిమనాడు పూజింతురు.

ఒకనాడు వ్యాసుని ఆశ్రమము దగ్గరికి కొందరు వెళ్ళి అక్కడ యమునా నదిని దాటే ఉపాయం చెప్పమని కోరారు. వ్యాసుడు వారిని పళ్లుపాలు తెమ్మనగా వారు తెచ్చి యిచ్చారు. వ్యాసుడు తృప్తిగా పుచ్చుకున్నాడు. 'నేను ఈ క్షణం దాకా ఉపవాసవ్రతం చేసినట్లైతే ఈ యమునానది మీకు దారి యిస్తుంది' అన్నాడు. ?మేము తెచ్చిన పాలుపళ్లు మీరు తృప్తిగా ఆస్వాదించటం మేము కళ్లారా చూశాము. కనుక, మాకిక దారి లేదు' అన్నారు వాళ్లు. అప్పుడు వ్యాసుడు, 'నేను వాటిని ఆరగించలేదు. వాటిని కృష్ణార్పితం చేశాను. నేను ఈ శరీరాన్ని కాదు. నేను ఆత్మను. ఈ

దేహం నా గేహం' అన్నాడు. ఆయనకు అంత గాఢమైన ఆత్మచైతన్యం ఉన్నది కాబట్టి తాను యేమీ ఆరగించలేదని చెప్పగలిగాడు.

వ్యాసుడు చాలా గొప్ప విద్యావంతుడు. అనంతమైన వేదాలను అల్పాయుష్కులైన మానవులు అధ్యనం చేయలేరు కనుక, అన్ని వేదములందున్న ఋక్కులను వేరుచేసి ఋగ్వేదమని పేరు పెట్టాడు. ఇది మంత్రస్వరూపము. అనంతమైన వేదములలోని యజస్సులను వేరుచేసి యజుర్వేదమని పేరు పెట్టాడు. యజస్సు అనగా యజ్ఞయాగాది క్రతువులు ఆచరించుటకు ఉపయోగపడేది. అన్ని వేదములందున్న సామములను వేరుచేసి సామవేదమని పేరు పెట్టాడు. సామమనగా సంగీతసాహిత్యములకు పనికివచ్చేది. ఇంక అస్త్రశస్త్రములకు, ఆరోగ్యమునకు సంబంధించిన మంత్రములను వేరుచేసి అధర్వణవేదమని పేరు పెట్టాడు. ప్రజల ఉపయోగార్థం వేదాలను విభజించినవాడు కనుక, వ్యాసునికి గురువు అని పేరు వచ్చింది.

వ్యాసుడు జయకావ్యం అని మరొక పేరు కలిగిన మహాభారతం రచించాడు. అందులో శ్రీకృష్ణుడనే కేంద్రంచుట్టూ పరిభ్రమించే భీష్మ, భీమ, అర్జున, విదుర, ధర్మజ, ద్రౌపది, కుంతివంటి పాత్రలు ఉజ్వల నక్షత్రాలు. ఈ పురాణం అజ్ఞా అంధకారమునూ, సంకుచిత స్వార్థమునూ, వేర్పాటుతనంవల్ల కలిగే పిరికితనమునూహృదయములనుంచి తొలగిస్తుంది. కనుక, వ్యాసునికి లోకగురువు అన్న బిరుదు సార్థక సముచితం. శంఖచక్రములు లేని విష్ణువు, మూడు కన్నులు శివుడు, నాలుగు తలలు లేని బ్రహ్మ అని వ్యాసుని ప్రశంసించారు.

వ్యాసుడు భాగవతమును వ్రాయుటకు కారణమేమిటి? భగవంతుడు లోకదాత. వ్యాసుడు శ్లోకదాత. ఇతను శ్లోకదాతగా మారినాడుగానీ, శోకం మాత్రం నివారణ కాలేదు. ఇతడు మహాభారతమును గొప్పగా వర్ణించాడు. కానీ, మనశ్శాంతి లభించలేదు. తరువాత నారదుడు వ్యాసుని కలుసుకొని, 'దైవంయొక్క లీలాగుణగణ విశేషములను వర్ణించి నట్లైతే శాంతి లభిస్తుంద'ని అన్నాడు. 'నీవు దుర్యోధన దుశ్శాసనుల గురించి వ్రాసే సమయంలో నీ భావాలంతా దుర్భావాలుగా మారిపోయాయి. ఎవరిగురించి ఎంత చింత చేశావో ఆ చింత నీలో ప్రవేశించింది. దానివల్ల నీవు మాలిన్యమైపోయావు. భారతమును వ్రాసావుగానీ నీ హృదయం మాలిన్యమైపోయింది. ఎందుకోసం? నిరంతరం దుష్టులను, దుర్మార్గులను చింతించావు. మంచిచెడ్డలు రెండింటి గురించి వ్రాసావు. ఇప్పుడు కేవలము మంచిని మాత్రమే వ్రాయి. భారతము వ్రాసినంత కాలమూ ఒకవైపు ధర్మమూర్తులను, మరొకవైపు అధర్మపరులను చింతిస్తూ వచ్చావు. కనుకనే, నీకు శాంతి లభ్యము కాలేదు. ఒక్కదానియందే లక్ష్యమునుంచుకో. 'బ్రహ్మవిద్‌బ్రహ్మైవభవతి' బ్రహ్మను చింతిస్తూవస్తే నీవే బ్రహ్మగా మారిపోతూ వస్తావు. కనుక, వ్యాసా! రేపటినుండి నీవు భగవంతుని లీలాగుణగణ విశేషములను వర్ణిస్తూరా. నీకు తప్పక శాంతి లభ్యమౌతుంది' అని నారదుడు బోధించాడు.

ప్రమిద, నూనె, వత్తి ఈ మూడూ లభ్యమైననూ, నిప్పు లేనిదే దీపము వెలుగదు కదా! పూలు, దారము, సూది దొరికిననూ మాలాకారుడు లేక మాలలు కావు. విద్య, బుద్ధి ఉండిననూ మోక్షపదమునకు త్రోవ చూపించే ఒక గురువు లభించవలెను. గురు బోధలద్వారా జీవితమే ఒక సుదీర్ఘమైన పుష్పమాల అనియూ, సుఖదుఃఖాలు, కష్టసుఖములు. ఆశానిరాశలు మొదలైన ద్వంద్వములే పుష్పములనియూ, బ్రహ్మమనే సూత్రములోనే యివన్నీ బంధింపబడి యున్నవనియూ తెలుసుకొనవలెను. పూలు రాలిపోవును, కూలిపోవును. అవి శాశ్వతములు కావు. అయితే, అన్ని పూవులకు ఆధారస్వరూపముగానున్న సూత్రము నిత్యమే! దీనినే బ్రహ్మసూత్రమని వ్యాసుడు స్పష్టపరచియున్నాడు.

వేదవృక్షమునకు వేదాంతమే పుష్పములు. ఆనందమే ఫలము. మనసునకు ధార్మికముగానూ, ఆధ్యాత్మికముగానూ తరిఫీదు చేసితే ఆ ఆనందమును ఆస్వాదించ గలదు. సాధనతో అన్నియును సమకూరును, మాటల మ్యాజిక్‌తో కాదు. పుణ్యఫలము నాశించేవాడు పుణ్యకర్మలకు పూనుకొనవలయును. చెట్టు నాటిన తక్షణమే కాయలు కాయలేదేఅని చింతించకుండా, సాధన బలమునూ, అనుగ్రహ బలమును సంపాదించుకొనవలయును. అటుల చేసిన రామకృష్ణ,

జయదేవ, గౌరాంగ తుకారాములవలె పవిత్ర జీవులుగా పూజార్హులగుదురు. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. జ్ఞానముతో చిత్తవృత్తులను నిరోధించితే, 'అహం బ్రహ్మాస్మి' అనే జ్ఞానము ఉదయించి శాశ్వతానందము దొరుకుతుంది. కాలకర్మనియమములతో సాధన సలుపవలెను. ఏదీ లేకున్న నిరంతరమూ భగవన్నామ స్మరణలో నిమగ్నుడై యుండిన, అదే చాలు. అంతరంగము ఆనందముతో నిండును. ప్రేమతో సర్వ జీవుల సేవ చేసిననూ అదే ఆనందము లభ్యమౌతుంది. బురదలో చిక్కుకొని , లేవ శక్తి లేక బాధ పడుచున్న ఒక ఆవును చుట్టూ చేరిన జనులు వినోదముగా అవలోకించు చుండగా, ఆ మార్గములోనే తీర్థయాత్రకు ప్రయాణమైన ఒక సన్యాసి ఆ గోవు పడే బాధను చూడలేక పోయాడు. చొక్కాను వదలి, అంగవస్త్రమును పారవేసి ఆయన బురదలో దిగి దాని కడుపు క్రింద తల పెట్టి, అది త్రొక్కినా లెక్కింపక, ఆ ఆవును గట్టుపైకి తీసుకు వచ్చి కాపాడినాడు. 'నీకెందుకయ్యా యింత శ్రమ? ఊరికే నీ దారి నీవు పోకూడదా?' అని ప్రజలు అడిగితే, ' ఆ బాధను చూచినప్పుడు నాకు కలిగిన బాధను నేను చల్లార్చుకొన్నాను. అంతే! ఉపకారమని కాదు. సేవ అని కాదు. నా హృదయ బాధను నివారణ చేసుకొన్నాను' అన్నాడు.

భారతయుద్ధము జరుగునప్పుడు వ్యాసభగవానుడు 'అక్కడవారూ తనవారు, ఇక్కడవారూ తనవారు' కనుక, యుద్ధభూమికి వెనుక భాగములో నడచి యెచ్చటికో వెడుతున్నాడు. అదే దారిలో ఒక సాలెపురుగు పరుగెత్తుకొని పోవుచుండ, దానిని చూచి, వ్యాసులవారు, 'ఎందుకింత తొందర' అని ప్రశ్నించినారు. దోవనుండి తప్పించుకొని పురుగు జవాబిచ్చింది. 'తెలియదా! అర్జునుని రథము యీవైపు వచ్చుచున్నది. దాని చక్రము నా పైకి వచ్చిన, నేను పచ్చుడి అయిపోతాను కదా!' అంది. 'అయ్యో! నీవు పోతే జగత్తుకు కలిగే నష్టము ఏమిటి? నీ కేమి పెద్ద కర్తవ్యములా! సంబంధములా!' అని వ్యాసులవారు నవ్వినారు. అప్పుడా క్రిమి కోపముతో యిట్లనింది. ' నా ప్రాణము పోతే నష్టము లేదా? నాకూ పెండ్లాము బిడ్డలున్నారు. ఆస్తిపాస్తులున్నవి. ప్రాణముపై ఆశ ఉన్నది. ఆకలి, దప్పి, సుఖము, దుఃఖము, కష్టము, నష్టము మీకూ నాకు సమానమే. స్వరూపస్వభావములలో వ్యత్యాసములుండునుగాని విషయానందము మాత్రం సర్వులకూ సమానమే!' అప్పుడు వ్యాసులవారు,

ఆహారనిద్రా భయమైథునాని సామాన్యమేతత్పశుభిర్నరాణామ్
జ్ఞానం నరాణాం అధికో విశేషః జ్ఞానేనశూన్యః పశుభిస్సమానః

అనే శ్లోకమును చెప్పిరి. జ్ఞానమొక్కటి పశువులకు లేదు. నరులకు లభించు జ్ఞానము వలన, క్రిమికీటకాదులలో నివసించుచున్న పరమాత్మని దర్శించ వచ్చును. 'సర్వం విష్ణుమయం జగత్ ' అని ఆనందించవచ్చును.

ఇట్టి వైరాగ్య భావము నిజమానవుని లక్షణము. దానితోబాటు వివేకమునూ, విచక్షణనూ మానవుడు పెంచ వలయును. దుష్టశిక్షణము, శిష్టరక్షణము భగవంతుని గుణములనేది సరికాదు. భగవంతుడు సాక్షీభూతుడు మాత్రమే. మీ చెడ్డే మీకు శిక్ష. మీ మంచే మీకు రక్ష. మీ అభివృద్ధి, మీ అధోగతి రెండూ మీ గుణములననుసరించియే సిద్ధించును. వ్యాసభగవానుడు, భగవత్తత్త్వము ఎవరికీ యేమాత్రమూ తెలియని పరిస్థితిలో, అందరికీ విశదముగా, సోదాహరణముగా, సుస్పష్టముగా అందించాడు.

శాస్త్రములలో కలియుగము మోక్షసాధనకు అనుకూలమైనదిగా పేర్కొన్నారు. గడిచిన యుగాలలో మోక్ష ప్రాప్తికి కఠిన తపస్సు అవసరం అయ్యేది. మీరిప్పుడు కలియుగంలో నామస్మరణ ద్వారానే మోక్షం పొందవచ్చు. ప్రభువు నామం స్మరించి దానికి సంబంధించిన వైభవమును భావించినప్పుడు మనస్సుమహదానంద తరింగతమై ఉప్పొంగుతుంది. వ్యాసునికి కూడా ఈ విషయం తెలుసు. ఒకనాడు కొందరు ఋషులు వ్యాసుని దగ్గరికి వెళ్ళి మోక్షప్రాప్తికి మానవుడు అనుసరించే యోగమార్గాలలో సుకరమైనది, ఫలసిద్ధి కలిగించేదీ ఏదని ప్రశ్నించారు. వారి ప్రశ్నను ముందుగానే ఊహించి, 'కలియుగములో పుట్టబోయే వారు ఎంత అదృష్టవంతులోకదా!' అనుకున్నాడు బిగ్గరగా. ఈ యుగంలో భగవదనుగ్రహం సంపాదించుకోటం సులభసాధ్యం.